సాక్షి
ఏలూరు
ఆదివారం ; 12 ; జనవరి ; 2025



కనులపండువగా కుడారై

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కుడారై ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. 1250 గిన్నెలతో స్వామివారికి ప్రసాదాన్ని నివేదించారు.



మెరిసిన దేవదేవుడు

ద్వారకాతిరుమల: క్షేత్రంలో ఉదయం చిన వెంకన్న తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది. అధ్యయనోత్సవాలను పురస్కరించుకుని రాత్రి సైతం తిరువీధి సేవ నిర్వహించారు.



బాల్య వివాహాలతో అనర్థాలు

భీమడోలు: బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని గుండుగొలను వైద్యాధికారి కె.శ్రీలక్ష్మి అన్నారు. గుండుగొలనులో బాల్య వివాహాల నిరోధంపై ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

స్ఫూర్తిప్రదాత ఓబన్న



కలెక్టరేట్‌లో ఓబన్న జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఏలూరు కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రి రెడ్డి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓబన్న త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఓబన్న పోరాటం చేశారన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్‌వీ నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత, డీఈఓ వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

తిరుపతి తొక్కిసలాట ఘటన బాధ్యులపై చర్యలేవి?

కొయ్యలగూడెం: తిరుపతి దుర్ఘటనకు సంబంధించి నటుడు అల్లు అర్జున్‌పై మోపిన సెక్షన్లనే కలెక్టర్, ఈఓ, టీటీడీ చైర్మన్, డీఎస్పీలపై నమోదు చేయాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీకి లేఖ రాసినట్టు శనివారం కొయ్యలగూడెంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుర్ఘటన జరిగి మూడు రోజులు అవుతున్నా అందుకు కారకులైనవారిని గుర్తించి కూడా చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ తప్పిదానికి నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ సంధ్య థియేటర్ దుర్ఘటనలో ఒకరు చనిపోతే 16 మందిపై కేసు పెట్టారని, కానీ తిరుపతిలో ఆరుగురు చనిపోయినా అందుకు కారకులైన వారిని శిక్షించకుండా ఉపేక్షించడం నేరమని స్పష్టం చేశారు. లా అండ్ ఆర్డర్ ఒక్కొక్కరికి ఒక్కోలా అమలు అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

ఐటీడీఏ పీఓగా రాములు నాయక్



బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కేతావత్ రాముల నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు శనివారం వెలువడ్డాయి. కృష్ణా జిల్లా సర్వశిక్షా అభియాన్ పీఓగా పనిచేస్తున్న రాముల నాయక్ ఇక్కడికి పీఓగా రానున్నారు. ఆయన గతంలో గుంటూరు జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేశారు. తర్వాత అమరావతి సీఏడీ, సీఎంఓ కార్యాలయాలు, ఏలూరులో విజిలెన్స్ శాఖలో పనిచేశారు. కాగా కేఆర్‌పురం ఐటీడీఏ పీఓగా పనిచేస్తున్న ఎం.సూర్యతేజ నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. అప్పటినుంచి జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఇన్‌చార్జి పీఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ముక్కంటి

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ముక్కంటి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ముక్కంటి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ) ఆర్‌ఎంసీ యూనిట్-2, ఏలూరులో పనిచేస్తున్నారు. గత ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీకి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులను ముఖ్యమంత్రే సత్కరించాలి


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉభయగోదావరి జిల్లాల నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ **అవార్డుకు** ఎంపికైన వారికి గత ఏడాది **నవంబర్** 11న విజయవాడలో జరిగిన అవా**ర్డుల ప్రధా**నోత్సవ కార్యక్రమంలో సత్కారం **జరగలేద**ని, అటువంటి ఉపాధ్యాయులకు తిరిగి **ముఖ్య**మంత్రి ద్వారానే సత్కార కార్యక్ర**మం ఏర్పా**టు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ **ఫెడరేషన్** 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కా**ర్యదర్శులు** పి.రత్నం బాబు, జి మోహన్‌రావు ఓ **ప్రకటనలో** డిమాండ్ చేశారు. ఉభయ గోదావరి **జిల్లాలో 28** మంది ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ **ఎన్నికల** కోడ్ ఉన్న కారణంగా అవార్డుల **ప్రధానోత్స**వం వాయిదా పడిందని పేర్కొన్నా**రు. వీరికి** అవార్డులను జిల్లా కేంద్రాల్లో కలెక్ట**ర్ల ద్వారా** అందించడానికి పాఠశాల విద్యా**శాఖ కమిష**నర్ ఉత్తర్వులను జారీ చేయడం **సరికా**దని తెలిపారు. రాష్ట్ర ఉత్తమ ఉపా**ధ్యా**యులుగా ఎంపికైన వారు ముఖ్య **మం**త్రి చేతులమీదుగా అవార్డును అం**దు**కోవడం గొప్ప గౌరవమని, అలాంటి గౌరవాన్ని దూరం చేయడం తగదన్నారు. కమిషనర్ ఉత్తర్వులను సవరించి జనవరి 26న రిపబ్లిక్ డే **నం**దర్భంగా ముఖ్యమంత్రి చేతులమీ**దుగా** పురస్కారాలు అందించేలా చర్యలు **తీసుకో**వాలని, ఇందుకు విద్యాశాఖ మం**త్రి జోక్యం** చేసుకోవాలని కోరారు.

కళ తప్పిన సంక్రాంతి

జిల్లాలో వ్యాపారం వెలవెలబోతుంది.. సంక్రాంతి కళ తప్పింది.. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గడంతో మార్కెట్లలో సందడి కనిపించడం లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాల మీద ఆధారపడిన దిగువ, మధ్యతరగతి కుటుంబాలు పూర్తిగా ఆర్థికంగా సతమతమతమవుతుండటంతో జిల్లాలో పండుగ జోష్ పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. ప్రధానంగా వస్త్ర, బంగారు, కిరాణా వ్యాపార విక్రయాలు 30 శాతానికి పైగా తగ్గాయి.

వ్యాపారం వెలవెల

- మందకొడిగా సంక్రాంతి కొనుగోళ్లు
- జిల్లాలో తగ్గిన వస్త్ర, బంగారు వ్యాపారం
- ప్రజల్లో మందగించిన కొనుగోలు శక్తి
- కూటమి ప్రభుత్వంలో అందని పథకాలు
- గతేడాది ఇదే సీజన్‌లో కళకళ



సాక్షి ప్రతినిధి, ఏలూరు : సంక్రాంతి పండుగకు గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. జిల్లాలోనే అతి పెద్ద పండుగగా ప్రతిఒక్కరూ భావిస్తూ పిండి వంటలు మొదలు దుస్తులు, బంగారం వరకు కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్‌లో విక్రయాలు కళకళలాడుతుంటాయి. సాధారణంగా క్రిస్మస్ నుంచి న్యూఇయర్, సంక్రాంతి వరకు అన్ని వ్యాపారాలకు సీజన్‌గా పరిగణిస్తుంటారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు క్యాలెండర్‌కు అనుగుణంగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుండేవి. ప్రధానంగా సంక్రాంతి సమయంలో అమ్మఒడి, రైతులకు ధాన్యం కొనుగోలు సొమ్ములు ఖాతాల్లో జమవుతుండటంతో వ్యాపారాలు బాగా జరిగేవి.

కొనుగోలు శక్తి తగ్గింది : కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కాకపోవడంతో దిగువ, మధ్యతరగతి కుటుంబాల్లో కొనుగోలు శక్తి మందగించింది. ఒక్క ఏలూరు నగరంలోనే 180 నుంచి 200ల వరకు వస్త్ర వ్యాపారాలు, 305 జ్యూయలరీ షాపులు, 1,530 కిరాణా వ్యాపారాలు, హార్డ్‌వేర్ మెటీరియల్ పెయింట్ షాపులు కలిపి 110, అలాగే 28 ప్రధాన హోటళ్లు ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లాలో ప్రధాన మున్సిపాల్టీలుగా ఉన్న కైకలూరు, నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం కలిపి సుమారుగా ఇదే స్థాయిలో వ్యాపార సముదాయాలు ఉన్నాయి.

పెరిగిన ధరలు.. ఆన్‌లైన్ తాకిడి

ప్రధానంగా జిల్లాలో ఆన్‌లైన్‌లో దుస్తులు, కిరాణా కొనుగోళ్లు అధికమయ్యాయి. ముఖ్యంగా కరోనా సమయం నుంచి జిల్లాలో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్‌కే అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి ఆఫర్లల్లో కొనుగోలు చేస్తుండటంతో స్థానిక వ్యాపారాలు మందగించాయి. సంక్రాంతి సీజన్‌లో గతంలో ఒక్క ఏలూరు నగరంలో అన్ని రకాల వ్యాపారాలు కలిపి రూ.100 కోట్ల నుంచి రూ.130 కోట్ల మేర ఉండేది. దీనిలో సింహభాగం కిరాణా, వస్త్ర వ్యాపారంలో ఉంటుంది. ఇక బంగార వ్యాపారం రూ.25 నుంచి రూ.30 కోట్ల వరకు జరిగేది. అయితే ప్రస్తుతం ఇది సుమారు 30 శాతం మేర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికితోడు నిత్యావసరాల ధరలు గణనీయంగా పెరిగాయి. గతేడాది సంక్రాంతి సీజన్‌లో వంటనూనె లీటరు సగటున రూ.90 నుంచి 100ల మధ్యలో ఉండగా ఈఏడాది రూ.140 నుంచి రూ.160 మధ్య ఉంది. మిగిలిన అన్ని రకాల సరుకులదీ ఇదే పరిస్థితి. స్థానిక వస్త్ర వ్యాపారులు డిస్కౌంట్లు ప్రకటించడంతో పాటు లాటరీలు పెడుతున్నా భారీస్థాయిలో విక్రయాలు జరగని పరిస్థితి. ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు రూ.60 కోట్ల మేర మాత్రమే అన్నిరకాల వ్యాపారాలు జరిగినట్టు అంచనా. విపరీతమైన రద్దీతో ఉండాల్సి ఉండగా దుకాణాలు వెలవెలబోతున్నాయి.

నాడు సంక్షేమం.. నేడు సంక్షామం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల ఖాతాలోనే సొమ్ములు జమచేసేవారు. దీంతో ఏటా నవంబర్ నుంచి జనవరి వరకు అన్నదాతలకు నగదు ఇబ్బంది ఉండేది కాదు. ఇలా జిల్లాలో 3.20 లక్షల మంది రైతులకు మేలు జరిగింది. అలాగే డ్వాక్రా మహిళలకు జనవరిలో కొత్త రుణాలు ఇచ్చేవారు. గ్రూపును బట్టి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు మంజూరయ్యాయి. జిల్లాలోని 36,934 గ్రూపుల్లో 3,55,315 మంది సభ్యులకు గత నాలుగేళ్లల్లో సంక్రాంతి సమయంలో రూ.1,305 కోట్ల నగదు జమచేశారు. అలాగే అమ్మఒడి కింద గత నాలుగేళ్లలో జిల్లాలో 2,91,855 మంది తల్లులకు రూ.486.96 కోట్ల లబ్ధి చేకూర్చారు. కూటమి ప్రభుత్వం అమ్మఒడిని తల్లికి వందనంగా మార్చడం, డ్వాక్రా రుణాలను కొనసాగిస్తామని ప్రకటించడం ఇలా పలు హామీలు ఇచ్చినా ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు.

రైతుల జీవితాల్లో వెలుగులు లేవు



జిల్లాలోని రైతులు తీవ్ర నిరాశ, నిస్పృహలతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం కన్నా అధికంగా ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని గద్దెనెక్కి ఆరు నెలలు దాటింది. ఇప్పటివరకూ ఆ హామీ అమలు కాలేదు. మరో వైపు ఖరీఫ్ సాగులో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న రైతులు రబీలోనైనా గట్టెక్కుదాం అనుకుంటే ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయం ఇవ్వలేదు. దీంతో రైతులు, కౌలుదారుల కుటుంబాల్లో సంక్రాంతికి వెలుగులు లేకుండా పోయాయి.

– కె.శ్రీనివాస్,ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి,ఏలూరు

చేనేత కుటుంబాల్లో పండుగ కళ లేదు



చితికిన బతుకులతో చేనేత కార్మికుల కుటుంబాల్లో సంక్రాంతి కళ లేదు. పండుగ నాడు అర్ధాకలితో గడపాల్సిన దుస్థితి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేనేత కార్మికుల కుటుంబాలకు అండగా నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టి ఏడాదికి రూ.24 వేల చొప్పున సాయం అందించింది. ఈ మొత్తం కూడా ఏటా నవంబర్‌లో అందించడంతో చేనేతలకు పండుగ జరుపుకునేందుకు ఉపయోగకరంగా ఉండేది. కూటమి ప్రభుత్వం నేతన్న నేస్తం నిలిపివేయడంతో పండుగ కళ తప్పింది.

– పిచ్చుక ఆదిశేషు, జిల్లా కన్వీనర్,ఏపీ చేనేత కార్మిక సంఘం

ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా



ప్రైవేట్ బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

భీమవరం(ప్రకాశం చౌక్): సంక్రాంతి పండగకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల టికెట్ చార్జీల బాదుడుపై 'సాక్షి' పత్రికలో వరుస కథనాలు రావడం, జిల్లా రవాణా శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లడంపై జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు స్పందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై నిఘా పెట్టారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతంలో ఓ బృందం, భీమవరం, పాలకొల్లు ప్రాంతంలో మరో బృందంతో ప్రత్యేక తనిఖీలు చేయిస్తున్నారు. రెండు రోజుల్లో 96 కేసులు రాసి రూ.14.35 లక్షల జరిమానా విధించారు. వేల రూపాయలు జరిమానా విధించారు. అలాగే ట్యాక్స్ పెనాల్టీ చెల్లించకుండా పర్మిట్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. డీటీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పండుగల తర్వాత కూడా ప్రత్యేక బృందాల తనిఖీలు కొనసాగుతాయని, అధిక చార్జీలు వసూలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.



అధికారులు సీజ్ చేసిన బస్సులు

కూటమి కోడి పందేలు!

రూ.1,500లు ఎంట్రీఫీజు.. సినిమా ఆడియో ఫంక్షన్లు నిర్వహించే ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులతో భారీ సెట్టింగులు.. పదుల సంఖ్యలో బౌన్సర్లు.. కోడి పందెం మొదలు అన్ని జూద క్రీడలతో భారీగా దుగ్గిరాలలో బరి సిద్ధమవుతోంది. ఇక జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో భారీ పందెం బరులు కూటమి నేతల కనుసన్నల్లో రెడీ అవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 150కుపైగా కోడి పందేల బరులు సిద్ధమవుతుండగా ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కో బరిని పోలీసులు పైపైన ధ్వంసం చేశారు.

బరితెగింపు

- జిల్లాలో 150కు పైగా బరులు
- ఉంగుటూరు, దెందులూరు, కొయ్యలగూడెంలో భారీ ఏర్పాట్లు
- ఇప్పటికే బరులు సిద్ధం చేసిన వైనం
- దుగ్గిరాలలో భారీస్థాయిలో ఏర్పాట్లు
- ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కో బరి ధ్వంసం



దెందులూరు నియోజకవర్గం దుగ్గిరాలలో సిద్ధమవుతున్న భారీ కోడి పందేల బరి

సాక్షి ప్రతినిధి, ఏలూరు : భారీస్థాయిలో కోడిపందేలకు ఏలూరు జిల్లా సన్నద్ధమైంది. ప్రతి నియోజకవర్గంలో ప్రతి మండలంలో ఐదారు గ్రామాలకు కలిపి ప్రధాన సెంటర్‌ను ఎంపిక చేసి భారీ కోడి పందేలకు తెరతీశారు. దాదాపు 20 రోజుల నుంచి కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే కోడి పందేల నిర్వహణకు చకచకగా ఏర్పాట్లు సాగుతున్నాయి. పోలీసు మొదలు అధికార యంత్రాంగం అందరికీ ప్రజాప్రతినిధుల ద్వారా ముందస్తు సమాచారం ఇచ్చి మరీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా **జిల్లాలో** ఉంగుటూరు, చింతలపూడి, దెం**దులూరు** నియోజకవర్గాల్లో భారీ బరులు **సిద్ధమవు**తున్నాయి. గతంలో పోలీసులు **వందల** సంఖ్యలో బైండోవర్ కేసులు, వేల కోడి కత్తులను స్వాధీనం చేసుకున్న పరిస్థితి. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో నామమాత్రంగా బరుల ధ్వంసం, బైండోవర్లకు మూడు రోజుల నుంచి తెరతీశారు. జిల్లావ్యాప్తంగా 150కుపైగా పందెం బరులను ఏర్పాటు చేశారు. అత్యధికంగా ఉంగుటూరు, చింతలపూడి నియోజకవర్గాల్లోనే పందెం బరులు ఉన్నాయి.

కూటమి నేతల కనుసన్నల్లోనే..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోడి పందేలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి. రాష్ట్రంలో పాటు తెలంగాణ, కర్ణాటక, విదేశాల్లోని జిల్లావాసులు పండుగకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ క్రమంలో కోడి పందేల నిర్వహణ భారీగా సాగుతుంది. దీంతో పాటు పందెం బరుల్లో పేకాట, కోతముక్క, గుండాట ఇతర జూదక్రీడలు, అనధికారిక మద్యం దుకాణాలు కూడా కోడి పందేల బరుల వద్దే ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేకించి జిల్లాలో కూటమి నేతలు ముందస్తు అన్ని ఏర్పాట్లతో భారీగా నిర్వహిస్తున్నారు.

ముందస్తు ఒప్పందాలు

జిల్లాలో దెందులూరు నియోజకవర్గంలో దుగ్గిరాల, పెదవేగి, పెదపాడులో బరులు సిద్ధం చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, గుండుగొలను, పత్తేపురం, కైకలూరు నియోజకవర్గంలో భుజబలపట్నం, పోతుమర్రు, కలిదిండి, భైరవపట్నం, చింతలపూడి నియోజకవర్గంలో శ్రీనివాసపురం, దేవులపల్లి, లక్కవరం, పేరంపేట, ఎ.పోలవరం, చింతలపూడి , సీతానగరం, కళ్లచెరువు, వెంకటాపురం, రావికంపాడు, లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, కలరాయన్నగూడెంలో లక్షల్లో బెట్టింగులు నిర్వహించేలా కోడి పందేల శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇవికాకుండా ఊరురా శిబిరాలనే రీతిలో ప్రతి ఐదారు గ్రామాలకు ఒక చోట పందెం బరులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు సోషల్ మీడియాలోనూ స్థానికంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కైకలూరు, నూజివీడు, దెందులూరుకు కృష్ణా జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు రానున్నారు. ఈసారి వందలతో ప్రారంభమయ్యే బెట్టింగులు కోట్లల్లో నిర్వహించేలా ముందస్తుగానే ఒప్పందాలు పూర్తి చేసుకుని పందెంకోళ్లను సిద్ధం చేశారు.

నామమాత్రంగా బరుల ధ్వంసం

హైకోర్టు అక్షింతల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం కోడి పందేల బరుల ధ్వంసం మొదలుపెట్టింది. జిల్లా పరిధిలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్‌డివిజన్ పరిధిలోని 32 పోలీస్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం 26 బరులను గుర్తించి ధ్వంసం చేశారు. ఇవన్ని కూడా చిన్న పందెం బరులు కావడం విశేషం. పైపైన ట్రాక్టర్లతో దున్నించి ఏర్పాట్లు చేయవద్దని నిర్వాహకులను హెచ్చరించారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



రాజవరం సమీపంలోని పులపాకులు చెరువులో మట్టి తవ్వకం

కొయ్యలగూడెం: రాజవరం–యర్రంపేట గ్రామాల మధ్య పులపాకుల చెరువు నుంచి మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నెల రోజుల నుంచి రాత్రిళ్లు పొక్లయిన్లతో అక్రమార్కులు మట్టిని తవ్వి తరలిస్తున్నారని రైతులు అంటున్నారు. ఇటీవల విషయం ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి వెళ్లడంతో పీడబ్ల్యూడీ డీఈ రవీంద్ర సిబ్బందితో వెళ్లి విచారణ చేశారు. మట్టి తవ్వకాలు జరిగినట్టు నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదించారు. అయినా అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. రోజుకు 50కు పైగా లారీల్లో మట్టిన తరలిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఇటీవల బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చెరువు గట్టు, చెరువు అంతర్భాగంలో అభివృద్ధి పనులు చేశారని మట్టి రవాణాతో పనులు ధ్వంసమవుతున్నారని రైతులు వాపోతున్నారు.

సొంతూళ్లకు పయనం



సంక్రాంతి సంబరాలకు చిన్నాపెద్దా, పిల్లాపాప సొంతూళ్లకు ప్రయాణమవుతున్నారు. మది నిండా ఆనందంతో కుటుంబసభ్యులతో పండుగ చేసుకునేందుకు పల్లెబాట పడుతున్నారు. శనివారం నుంచి ఏలూరులో కళాశాలలు, పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సొంత గ్రామాలకు పయనమవుతున్నారు. దీంతో నగరంలోని బస్టాండ్లు కిటకిటలాడాయి. శనివారం ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



ఏలూరు కొత్త బస్టాండ్ వద్ద వేచి ఉన్న ప్రయాణికులు





బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ..

చోరీ నిందితుల అరెస్టు


చోరీ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం: ఫ్లిప్‌కార్ట్–ఇన్‌స్టాకార్ట్ డెలివరీ సర్వీస్ కార్యాలయంలో చోరీకి పాల్పడిన ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. శనివారం పోలీసు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 30న సాయిబాలాజీ టౌన్‌షిప్ డెలివరీ కార్యాలయంలో రూ.3,73,592 చోరీకి గురైనట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం గ్రామానికి చెందిన పిల్లి నాగదుర్గారావు ప్రధాన నిందితుడని, అతనితోపాటు బుట్టాయగూడెం మండలం కంద్రికగూడెంకు చెందిన రుద్రల్ల సాయికృష్ణ నిందితుడుగా ఉన్నాడని చెప్పారు. వీరికి మండలంలోని ఎ.పోలవరం గ్రామానికి చెందిన పిల్లి అనిల్, అదే గ్రామానికి చెందిన తానేటి విజయబాబు సహకరించినట్లు తెలిపారు. 2022లో ఇదే సంస్థలో చోరీకి పాల్పడి రూ.2 లక్షలు చోరీ చేసిన పిల్లి నాగదుర్గారావుతో పాటు ముదరకోల నాగబాబును కూడా అరెస్టు చేశామన్నారు. దుర్గారావు ఆరేళ్ల నుంచి నుంచి ఫ్లిప్‌కార్ట్ – ఇన్‌స్టా కార్ట్ డెలివరి సరీ్వసు ఆఫీసులో పనిచేస్తున్నాడని, 2 నెలల క్రితం ఉద్యోగం నుంచి తొలగించారని చెప్పారు. ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి, 2022 చోరీకి సంబంధించి మొత్తం రూ. 5,73,392 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని అభినందించారు.

భారీగా కోడికత్తులు స్వాధీనం

గణపవరం: శనివారం గణపవరంలో కోడికత్తులు తయారుచేస్తున్న పరిశ్రమపై సీఐ సుభాష్ ఆధ్వర్యంలో గణపవరం, నిడమర్రు, చేబ్రోలు ఎస్‌ఐలు, సిబ్బంది ఆకస్మిక దాడి చేశారు. దాడిలో 1300 కోడికత్తులను, కత్తులను తయారు చేసే యంత్రం స్వాధీనం చేసుకుని తయారీదారు ముసినాని బ్రహ్మానందంను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భగా సీఐ సుభాష్ మాట్లాడుతూ గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాలలో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరులను ధ్వంసం చేశామని తెలిపారు. గణపవరంలో 4, నిడమర్రులో 3, చేబ్రోలు పీఎస్ పరిధిలో 4 బరులను ధ్వంసం చేశామన్నారు. జూదాలు, గుండాటలు ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా గణపవరం మండలంలో 110 మంది, నిడమర్రులో 101, చేబ్రోలులో 106 మందిపై బైండోవర్ కేసులు పెట్టామని సీఐ తెలిపారు.

బరుల ధ్వంసం


చోరీ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

భీమడోలు: గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం గ్రామాల్లోని కోడి పందేల బరులను శనివారం రెవెన్యూ, పోలీస్ అధికారులు ధ్వంసం చేసారు. గుండుగొలనులో రెండు చోట్ల బరులు సిద్ధం చేసారు. కోడి పందేలు వేసేందుకు సిద్దంగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు చదును చేసి ఉన్న స్థలాన్ని బ్లేడ్ ట్రాక్టర్‌తో గాడ్లు కొట్టారు. టెంట్లను తొలగించారు. సంక్రాంతి ముసుగులో కోడి పందేలు నిర్వహిస్తే కోర్టు ధిక్కార కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దెందులూరు: రోడ్డు ప్రమాదం వ్యక్తి మృతి చెందాడని దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపారు. దెందులూరు మండలం ఉండ్రాజవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చదలవాడ సోమయ్య తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అడవుల సంరక్షణపై నిఘా ఉంచాలి

బుట్టాయగూడెం: అడవుల సంరక్షణపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎఫ్ఓ శ్రీ శుభం ఫారెస్ట్ అధికారులను సూచించారు. ఏలూరు జిల్లా డీఎఫ్ఓగా బాధ్యతలు చేపట్టిన శ్రీశుభం మొదటిసారిగా ఏజెన్సీ ప్రాంతంలో శనివారం పర్యటించారు. బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెం మీదుగా ముంజులూరు, గడ్డపల్లి, గిన్నేపల్లి మీదుగా పాపికొండల అభయారణ్యంలో పర్యటించారు.



అభివృద్ధి వైపు వడివడిగా

అన్ని రంగాల్లో దూసుకుపోతున్న ఏలూరు నగరం



(ఆర్ఆర్‌పేట) ఏలూరు పట్టణ స్థాయి నుంచి నగర స్థాయికి శరవేగంగా అభివృద్ధి చెందింది. వార్డులు డివిజన్లు అయ్యాయి. చట్టుపక్కల ప్రాంతాలు నగరంలో విలీనయమయ్యాయి. జనాభా పెరగడంతో వారి అవసరాలూ పెరిగాయి. వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు కృషి చేశాయి. నగరానికి తలమానికంగా బుద్ధ పార్కులో ప్రజలను ఆహ్లాదపరిచే ఎత్తయిన బుద్ధుడు, ప్రతి ప్రాంతంలో ప్రజలను ఉత్సాహపరిచే పార్కులు, ట్రాఫిక్ నిర్వహణకు మూడు ఫ్లై ఓవర్లు, వివిధ ప్రాంతాలను దగ్గర దారిలో కలిపేందుకు అండర్‌పాస్‌లు, తమ్మిలేరు ఏటిగట్టు రివిట్‌మెంట్, కాజ్‌వేల స్థానంలో వంతెనలు ఇలా అనేక రకాలుగా అభివృద్ధి జరిగింది. జిల్లాల పునర్విభజన అనంతరం కూడా ఏలూరు జిల్లా కేంద్రంగా ఏలూరు పరిపాలనా కేంద్రంగా కొనసాగుతోంది. రాష్ట్రంతో పాటు అనేక రాష్ట్రాలకు రవాణా పరంగా అత్యంత సౌకర్యవంతమైన ప్రాంతంగా ఏలూరును చెప్పుకోవాలి. రాష్ట్ర విభజన తరువాత కొత్తగా ఏర్పడిన రాజధానికి అత్యంత దగ్గర ప్రాంతంగా కూడా ఏలూరుకు మంచి గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం నగరీకరణ అత్యంత వేగంగా జరిగడంతో ప్రజలకు అన్ని సౌకర్యాలు చేకూరాయి.

అందుబాటులోకి ఆధునిక వైద్యం

ఒకప్పుడు మంచి వస్త్రాలు కావాలన్నా, మంచి ఆభరణాలు కావాలన్నా, ఖరీదైన కార్లు కావాలన్నా ఇటు విజయవాడకో, అటు రాజమండ్రికో పరుగులు పెట్టేవారు. ఏలూరు ప్రజలకు ఇప్పుడు అన్నీ చెంతనే దొరికేంతగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. ఆధునిక వైద్య సౌకర్యాలకు అందించేందుకు ఈ ప్రాంత ప్రజలకు ఆశ్రం వైద్య కళాశాలతో పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చులేని కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు అనేక కార్పొరేట్ ఆసుపత్రులు, నగరంలోని శ్రీ కృష్ణ హాస్పిటల్ (ఆర్థోపెడిక్), సత్యజ్యోతి హాస్పిటల్, కొప్పాక సూర్య హాస్పిటల్ వంటి ఆసుపత్రుల్లో సైతం స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటూ అన్ని రకాల వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో ఇక్కడి విద్యార్థులు ఇంజినీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులు చేయాలంటే ఇతర రాష్ట్రాలకో, రాష్ట్రంలోని ప్రధాన నగరాలకో వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం విద్యారంగం అభివృద్ధి చెందిన నేపథ్యంలో నగరంతో పాటు చుట్టుపక్కల మండలాలు, నియోజకవర్గాల విద్యార్థులకు అందుబాటులో ఏలూరు నగరంలో మూడు ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. రెండు మెడికల్ కళాశాలలు విద్యార్థుల ఆశయాలను నెరవేర్చే దిశగా అందుబాటులోకి వచ్చాయి. సిద్ధార్థ విద్యాలయ వంటి సంస్థలు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ప్రాంత విద్యార్థులకు విద్యావకాశాలు మరింత మెరుగయ్యాయి.

దూసుకుపోతున్న ఆటోమొబైల్ రంగం

ఆధునిక జీవన శైలిలో ప్రయాణాలకు సొంత వాహనాలను సమకూర్చుకోవడం నేటి ప్రజలకు తప్పనిసరిగా పరిణమించింది. వారికి అందుబాటులోకి వివిధ కంపెనీలకు సంబంధించి శ్రీకృష్ణ సుజుకి, బ్యాటరీ బైక్‌లకు శ్రీ వెంకట రమణ ఎంటర్‌ప్రైజెస్ వంటి వాహనాల షోరూంలు అందుబాటులోకి వచ్చాయి. కార్లు, ద్విచక్రవాహనాల షోరూంలకు కూడా నగరంలో ఆదరణ అధికంగానే లభిస్తోంది. ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చడానికి అనేక సంస్థలు వెంచర్లు వేస్తూ ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్ళ స్థలాలు విక్రయిస్తున్నారు. ఇళ్ళు నిర్మించుకునే వారికి ప్లాన్లు వేయడంతో పాటు నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేయడానికి హేలాపురి రియల్ కన్‌స్ట్రక్షన్స్ వంటి సంస్థలు ముందుకు వస్తుండగా విజయ సూర్య పైప్స్ కంపెనీ వంటి సంస్థలు అన్ని రకాల మంచినీటి, వ్యర్థ నీటి లైన్ల ఏర్పాటుకు నాణ్యమైన పైపులను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాయి.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం


భక్తులతో కిక్కిరిసిన అనివేటి మండపం

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రం శనివారం భక్తజన సంద్రంగా మారింది. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, సంక్రాంతి పండుగ సెలవులు నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించారు. ఉదయం నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, టికెట్ కౌంటర్లు, కేశఖండన శాల ఇతర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. అనివేటి మండపంలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

బాస్కెట్‌బాల్ పోటీలు నూజివీడుకే గర్వకారణం


పురుషుల విభాగంలో ఏలూరు-అనపర్తి జట్ల మధ్య తొలి మ్యాచ్

నూజివీడు: బాస్కెట్‌బాల్ పోటీలు నూజివీడుకే గర్వకారణమని డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. ధర్మఅప్పారావు కళాశాల ఆవరణలో శ్రీరాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 48వ స్మారక తెలుగు రాష్ట్రాల బాస్కెట్‌బాల్ పోటీలను శనివారం డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలన్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థి దశలోనే తర్ఫీదునిస్తే గ్రామస్థాయి నుంచి మేటి క్రీడాకారులు తయారవుతారన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పురుషుల విభాగంలో తొలి మ్యాచ్ ఏలూరు– అనపర్తి జట్ల మధ్య నిర్వహించారు. ఈ బాస్కెట్‌బాల్ పోటీలకు పురుషులు, మహిళలు కలిపి 45 జట్లు హాజరయ్యాయి. పట్టణ సీఐ పీ సత్య శ్రీనివాస్, టోర్నమెంట్ కన్వీనర్ పీ సాధన, ఎస్సై జ్యోతిబసు, డీఏఆర్ కళాశాల పాలకవర్గం కోశాధికారి మేకా హర్షిత్ ధర్మ అప్పారావు, ఇంటర్నేషనల్ మెజీషియన్ గుగాంపో, కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీటెక్, ఎంటెక్‌ల కన్నా సెలూన్‌లే బెటర్

మంత్రి రామానాయుడు

పాలకొల్లు సెంట్రల్: యువత బీటెక్‌లు, ఎంటెక్‌లు చదివేకన్నా హెయిల్ సెలూన్‌లు ఏర్పాటు చేసుకోవడమే బెటరేమో అంటూ రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. శనివారం పాలకొల్లులోని బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలిదిండి రామరాజు సౌత్ స్టేట్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు క్రీడాకారుల హెయిర్ స్టైల్ చూసి 'యువత హెయిర్ స్టైల్ బాగుంది.. ఇప్పుడు బీటెక్‌లు, ఎంటెక్‌లు చదివేకన్నా హెయిర్ సెలూన్‌లు పెట్టుకుంటే బాగుంటుందేమో.. నెక్స్ట్ మనం ఏదైనా ప్లాన్ చేసుకుంటే బెటరేమో' అంటూ వ్యాఖ్యలు చేశారు. మంత్రి వ్యాఖ్యలపై సభలో ఉన్న కొందరు స్పందిస్తూ.. ప్రభుత్వం ఇక ఉద్యోగాలు ఇవ్వదేమో.. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ విమర్శించారు.

రాష్ట్రంలో కిడ్నీ వ్యాధి నిపుణుల కొరత

వైద్య ఆరోగ్య మంత్రి సత్య కుమార్


డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

ఆకివీడు: రాష్ట్రంలో నెఫ్రాలజిస్టుల కొరత తీవ్రంగా ఉందని వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్య కుమార్ చెప్పారు. ఆకివీడులో 30 పడకల ఆసుపత్రి భవనం, డయాలసిస్ కేంద్రం, ఉద్యానవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మించిన భవనానికి రంగులు, ఫర్నిచర్ పూర్తిచేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. 55 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయని, దాతల సహకారంతో మరో రెండు కేంద్రాలు ప్రారంభించామన్నారు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హార్ట్‌ఎటాక్‌లను నివారించేందుకు పీహెచ్‌సీల్లో ఏర్పాటు చేసిన ఇంజెక్షన్ల వల్ల 965 మంది ప్రాణాల్ని కాపాడామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, డీసీహెచ్ఎస్ పగడాల సూర్యనారాయణ, డీఎంహెచ్ఓ భాను నాయక్, ఆర్డీఓ ప్రవీణ కుమార్ రెడ్డి, మునిసిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ పుప్పాల పండు తదితరులు పాల్గొన్నారు.